ఆక్రమించేద్దాం.. పత్రాలు సృష్టిద్దాం

బెల్లంపల్లిలో కబ్జాల పర్వం కోరలు చాచుతోంది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జాకోరులు రెక్కలు కట్టుకుని వాలిపోతున్నారు. బెల్లంపల్లిలో భూముల కబ్జాలు 'మామూలు' గానే మారిపోయాయి. అధికారుల పట్టింపులేనితనం, బాధ్యతారాహిత్యం వెరసి ప్రభుత్వ భూములను మింగేస్తుంది. విచ్చలవిడిగా కబ్జాలకు తెగబడుతున్నా అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది. అక్రమార్కులు అధికార, రాజకీయ అండదండలతో పేట్రేగిపోతున్నారు. నకిలీ పత్రాలు సృష్టించి రెవెన్యూ, మున్సిపల్, సింగరేణి అధికారులకు సవాలుగా మారుతున్న పరిస్థితులు బెల్లంపల్లిలో నెలకొన్నాయి.



బెల్లంపల్లి కెమికల్ ఏరియాలో కబ్జాకు గురైన స్థలం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే

కెమికల్ ఏరియాలో సింగరేణి భూమి కబ్జా

పట్టణంలోని కెమికల్ ఏరియాలో సింగరేణి సంస్థకు సంబంధించిన దాదాపు రెండు ఎకరాల స్థలం కబ్జాకు అక్రమార్కులు ప్రయత్నిస్తున్నారు. దసరా పండగకు ముందు ఇదే స్థలంలో మూడు బోర్డులను గతంలోనే సింగరేణి పాతింది. అప్పటి నుంచి ఆ బోర్డులు అలాగే ఉన్నాయి. పండగ కావడంతో కబ్జాకోరులు సింగరేణి యాజమాన్యం పాతిన బోర్డులను తొలగించి జేసీబీ, ట్రాక్టర్లతో చదును చేశారు. జాతీయ రహదారి వంతెన పక్కనే ఉండడంతో ఈ భూమికి డిమాండ్ పెరిగింది. పెట్రోల్ బంకుకు సమీపంలో ఉన్న ఈ స్థలంపై కన్నేసిన కబ్జాదార్లు దొంగపత్రాలతో సింగరేణి అధికారులను బురిడీ కొట్టించడానికి తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. పట్టణంలో దొంగపత్రాలు సృష్టించడం పరిపాటిగా మారింది. దొంగపత్రాలు సృష్టిస్తున్న అక్రమార్కులను పట్టుకోవడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమవుతుందనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ శాఖలో పదవీ విరమణ పొందిన అధికారులు నకిలీ పత్రాల తయారీకి సహకరిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.



సింగరేణి అధికారులు పాతిన బోర్డు



గతంలో అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

బోర్డు పాతిన సింగరేణి అధికారులు

కెమికల్ ఏరియాలో చదును చేసిన సింగరేణి భూమి స్థలంలో రక్షణ సిబ్బంది మళ్లీ బోర్డులను పాతారు. గతంలోనూ ఇక్కడ ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి మరీ చదును చేశారు. భూమికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నాయని సింగరేణి అధికారులకు చెప్పినట్లు సమాచారం. అన్ని పత్రాలను చూసిన అధికారులు సరిగా లేకపోవడంతో మళ్లీ బోర్డును పాతారు. సింగరేణి స్థలాలను కబ్జా చేస్తే కేసులు తప్పవని అధికారులు హెచ్చరించారు.

ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) ఆధ్వర్యంలో జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. ప్లంబింగ్, శానిటేషన్, ఎలక్ట్రీషియన్ కోర్సులకు సంబంధించి మూడు నెలలపాటు ఉచిత శిక్షణ అందించి ధ్రువీకరణ పత్రంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అక్టోబరు 5లోగా 8328507232, 8790414049లను సంప్రదించాలన్నారు.

17న వాల్మీకి జయంతి

ఏసీసీ, న్యూస్‌టుడే: ఈ నెల 17న మహర్షి వాల్మీకి జయంతి నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.వినోద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి అధికారులు, నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పేట్రేగిపోతున్న ఆగడాలు.. యువకులే సమిధలు

మంచిర్యాల పట్టణంలోని ఐబీ ప్రాంతంలో ఇద్దరి మధ్య చిన్నగా మొదలైన గొడవ తీవ్ర స్థాయికి చేరింది. ఆ విషయం ఆ బృందం యువతకు తెలియడంతో ఒక్కసారిగా వచ్చి మూకుమ్మడి దాడి చేశారు. అవతలి వ్యక్తులను తీవ్రంగా గాయపరిచారు. ఆ చిత్రాలు అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఇద్దరు యువ నాయకులపై ఇటీవల జిల్లా కేంద్రంలోని వేర్వేరు చోట్ల ఆ బృందం సభ్యులే దాడి చేశారు. ఆ యువకుల మధ్య గొడవలా.. రాజకీయ కక్షసాధింపు చర్యలా అనేది తెలియదు గానీ వారిని తీవ్రంగా గాయపరిచారు. వాహనాలూ ధ్వంసం చేశారు.


జిల్లా కేంద్రంలోనే ఓ నివాస సముదాయంలో ఆ బృందం సభ్యులతో గొడవపడి ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఒకరి పరిస్థితి ఇప్పటికీ విషమంగా ఉన్నట్లు సమాచారం.

బతుకమ్మ వేడుకల్లో భాగంగా హమాలీవాడలో జరిగిన గొడవలో ఆ బృందం ప్రత్యక్షమై పలువురిని ఇష్టారీతిన చితకబాదారు. గాయపరచడంతోపాటు చివరకు బాధితులపైనే కేసులు పెట్టారంటూ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆ కాలనీ మహిళలు ఆందోళన చేశారు. పోలీసులపై తీవ్ర విమర్శలు చేశారు.

● రాత్రయితే పట్టణంలో భయానక వాతావరణం

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే

మంచిర్యాల జిల్లా కేంద్రంలో రాత్రయితే చాలు భయానక వాతావరణం ఏర్పడుతోంది. ఒకరికి అనుకూలంగా, మరొకరికి వ్యతిరేకంగా మాట్లాడినా ఓ బృందం వచ్చి దాడులకు తెగబడుతున్నారు. ఆ బృందంలో ఉన్న యువతకు గంజాయి, ఇతర వ్యసనాలు అలవాటు చేసి కొందరు వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇలా పట్టణంలో రాత్రయితే చాలు ఏదో ఒక చోట గొడవ జరుగుతూనే ఉంది. మరోవైపు బాధితులపైనే కేసులు నమోదవుతున్నాయి. ఆయా పార్టీల కక్ష సాధింపు చర్యలకు అమాయకులను జైలుపాలు చేస్తున్నారంటూ పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.



జిల్లాకేంద్రంలోని పాతమంచిర్యాల, సూర్యనగర్, తిలక్‌నగర్, హమాలీవాడ, అశోక్‌రోడ్డు, బైపాస్ రోడ్డు, హైటెక్‌సిటీ.. ఇలా పట్టణంలో గొడవ జరగని కాలనీ కనిపించడం లేదు. వీటన్నింటిలో ఒకే ఒక్క బృందం పేరు వినిపిస్తోంది. ఇందులో ఏ ఒక్కరికి సంబంధం ఉన్న వ్యక్తితో పరిచయం ఉన్నా చాలు.. ఒక్క ఫోన్ చేస్తే సుమారు 25-30 మంది యువకులు రంగంలోకి దిగుతుంటారు. పోలీసులు ఎందుకు కట్టడి చేయలేకపోతున్నారు అనే ప్రశ్నలు ప్రజల్లో మొదలయ్యాయి. కొంతమంది ప్రజాప్రతినిధుల ఒత్తిడితోనే వారి ఆగడాలు నిలువరించలేకపోతున్నారా అనే సందేహాలు వారిలో వస్తున్నాయి. గొడవలకు ఉసిగొలిపి ఇరుపార్టీల ముఖ్యనాయకులు బాగానే ఉంటున్నారు.. చివరకు అమాయక కార్యకర్తలు మూల్యం చెల్లించుకుంటున్నారంటూ ప్రధాన పార్టీలకు చెందిన కొందరు ఆవేదన వ్యక్తం చేస్తుండటం విశేషం.

తల్లిదండ్రుల ఆవేదన..

జిల్లా కేంద్రంలో ఇటీవల తరచూ గొడవలకు పాల్పడుతున్న బృందంలోని యువతపై వారి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు, ఆ కాలనీల్లో కాస్త గౌరవంగా బతుకుతున్నవారి పిల్లలు ఇందులో ఉన్నారు. వీరిని గంజాయి, ఇతర వ్యసనాలకు బానిసలుగా మార్చి కొందరు తమకు అనుకూలంగా ఉండేలా చూసుకుంటున్నారు. వీరు బృందంగా గొడవలకు వెళ్లడం, ఇతరులను గాయపరచడం, గాయపడటం చూసి ఆందోళన చెందుతున్నారు. ఇరువైపులా ప్రాణాపాయ పరిస్థితి వస్తుందో ఏమో అని భయపడిపోతున్నారు.

ఖర్చు స్వల్పం.. వినియోగం అంతంతమాత్రం!

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

కూటి కోసం కోటి విద్యలు అన్నారు. ప్రపంచం మొత్తంలో ఎవరు ఏ పని చేసినా.. ఆకలి తీర్చుకోవడానికే.. తర్వాతే మిగిలినవన్నీ. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నామని చెప్పుకొంటున్నా అక్కడక్కడ ఆకలి కేకలు వినిపిస్తూనే ఉన్నాయి. కొన్ని చోట్ల విపరీతమైన ఆహారం వృథా అవుతూనే ఉంది. రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్‌లోనే ఆహారంపై అతి తక్కువగా ఖర్చు చేస్తున్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా ఆహార పరిస్థితులపై కథనం.

- ఉమ్మడి జిల్లాలో కూరగాయలు, పండ్ల వాడకం చాలా తక్కువ
- నేడు ప్రపంచ ఆహార దినోత్సవం

జిల్లాలో ఆహార పంటల్లో అత్యధికంగా వరితో పాటు పప్పుధాన్యాల సాగు ఉంటుంది. ఇతర జిల్లాలతో పోలిస్తే సోయా, కంది పంటల దిగుబడి ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతున్నా.. పేదరికం కారణంగా అనేక మంది పూట గడవడానికి కూలీ పనులు చేస్తూ పొట్ట నింపుకొంటున్నారు.

ఎందుకంటే?

ప్రపంచ ఆహార దినోత్సవం 1979లో ఏర్పాటు చేశారు. అక్టోబరు 16న ఐక్యరాజ్యసమితి, ఆహార, వ్యవసాయ సంస్థ(యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్‌కు సంబంధించిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్) స్థాపించారు. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా 150 కంటే ఎక్కువ దేశాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. ఏటా ఒక అంశం(థీమ్)పై అవగాహన కలిగిస్తారు. ఈ ఏడాది మెరుగైన జీవితం, మెరుగైన భవిష్యత్తు కోసం ఆహార హక్కును అంశంగా ప్రకటించారు.



ఉమ్మడి జిల్లాలో ఏటా పంటల ఉత్పత్తి (లక్షల టన్నుల్లో)	వరి : 5.25	కందులు : 9.60	పప్పుధాన్యాలు (చిరుధాన్యాలతో కలిపి) : 5.35	కూరగాయలు : 24.35	పండ్లు : 2,842 టన్నులు	పాలు : 3.28 లక్షల లీటర్లు	చేపలు : 38 వేల టన్నులు	మాంసం : 43 వేల టన్నులు

భారీగా వృథా..

జిల్లాలో కొంత మంది అర్ధాకలితో అలమటిస్తుంటే.. పలు చోట్ల ఆహారం వృథా చేస్తున్నారు. ప్రధానంగా వివాహాలు, ఇతర వేడుకలతో పాటు హోటళ్లలో వృథా శాతం ఎక్కువగా ఉంటోంది. వృథా చేసే బదులు దాన్ని ఉపయోగంలోకి తీసుకొస్తే.. పేదలకు కొంత మేలు జరిగే వీలుంది. అవసరమైన సౌకర్యాలు లేక పండించిన పంటలలో కూరగాయలు, పండ్లు త్వరగా చెడిపోతున్నాయి. ఉత్పత్తి ఎక్కువగా ఉన్న సమయంలో నిల్వ చేసుకునే సదుపాయాలు లేక తక్కువ ధరకే ఇవ్వడం లేదా బయట పారేయాల్సిన పరిస్థితి ఉంటోంది. మన దేశంలో ఏటా వృథా అయ్యే కూరగాయలు, పండ్ల విలువ రూ. 40 వేల కోట్లు ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు.

మీకు తెలుసా?

- ప్రపంచంలో ప్రతి ఒక్కరికి ఆహారం ఇవ్వడానికి అవసరమైన ఉత్పత్తి ఉన్నా.. తొమ్మిది మందిలో ఒకరు దీర్ఘకాలిక ఆకలితో బాధ పడుతున్నారు.
- ఆకలితో ఉన్న వారిలో 60 శాతం మంది మహిళలే..
- 45 శాతం మంది శిశు మరణాలు పోషకాహార లోపం కారణంగానే సంభవిస్తున్నాయి.
- భారత జనాభాలో పోషకాహార లోపంతో బాధ పడుతున్న వారు 14.5 శాతం కాగా, తక్కువ బరువుతో ఉన్న పిల్లలు 20 శాతం, రక్తహీనతతో బాధపడే మహిళల శాతం 51.4 ఉంది.

పేదలకు పంచి.. ఆకలి తీర్చి..



నిర్మల్ జిల్లాకు చెందిన నరహరి, ఆయన మిత్రులు నవీన్, వినోద్, చిట్టినేత, రామ్‌రాజ్ తదితరులు కలిసి ఫుడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఆహారం వృథాగా ఉన్న సమాచారం అందిస్తే అక్కడి నుంచి ఆహారాన్ని తీసుకొచ్చి అవసరమైన వారికి పంచిపెడుతున్నారు.

బోసినవ్వుల పాప.. ఎటు వెళ్లావమ్మా

● పాలు తాగిన తర్వాత 4 నెలల చిన్నారి మృతి



అతిథి

పుట్టి నాలుగు నెలలే అయింది అమ్మ
పుట్టిన మురిపెం తీరలేదమ్మా
తెల్లవారగానే బోసి నవ్వులతో నిన్ను చూస్తే
కడుపు నిండేదమ్మా
రేపటి నుంచి నీ బోసి నవ్వులను
ఎక్కడ చూడాలమ్మా
నుదుట, చెంప, పాదాలపై కాటుక
ఎవరికి పెట్టాలి తల్లి
నిన్ను ఎక్కడ వెతకాలమ్మా.. నా
బంగారు తల్లి
మమ్మల్ని విడిచి ఎక్కడికి వెళ్లావు రా..
బుజ్జి కన్నా

– ఇది ఓ నాలుగు నెలల చిన్నారిని పోగొట్టుకున్న తల్లిదండ్రుల గుండెనిండా ద్రవీభవించిన కన్నీటి వేదనకు ప్రతిరూపం.

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి పట్టణంలోని కన్నాలబస్తీకి చెందిన కట్ల నరేష్‌కుమార్, భవానీలకు ఇద్దరు సంతానం. మొదటి సంతానం నాలుగు సంవత్సరాల ఆదిత్యరాంకాగా రెండో సంతానం అతిథి(4 నెలలు). ఆడపిల్ల పుట్టిందని ఎంతో సంతోషడ్డారు. ఆ ఆనందం నాలుగు నెలల్లో కళ్ల ముందే ఆవిరైపోవడం ఆ తల్లిదండ్రుల్లో ఎనలేని దుఃఖాన్ని మిగిల్చింది. లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేసిన నరేష్‌కుమార్ కరోనా సమయంలో తల్లిదండ్రుల కోసం సొంత ఊరు బెల్లంపల్లికి వచ్చాడు. అప్పటి నుంచి ఇంటి వద్ద ఉండి ఆన్‌లైన్‌లో మెడికల్ కోడింగ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం ఉదయం ప్రతిరోజులాగే స్నానం చేయించి పాలు తాగించి ఆ చిన్నారిని పడుకోబెట్టారు. కాసేపటికి చలనం లేకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు బెల్లంపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంచిర్యాలలోని మరో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. పాలు తాగే సమయంలో ఊపిరితిత్తుల్లోకి వెళ్లి ఉంటాయని వైద్యులు చెప్పినట్లు సమాచారం. ఊహించని ఈ పరిణామంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ముక్కుపచ్చలారని కూతుర్ని చూసుకుని బోరున విలపించారు.

19న ఉమ్మడి జిల్లా స్థాయి కరాటే పోటీలు

బెల్లంపల్లి పట్టణం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి కరాటే పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.బాబురావు, జిల్లా కరాటే అసోసియేషన్ కార్యదర్శి ఎనగందుల వెంకటేష్ తెలిపారు. అండర్-19 పోటీలు జిల్లాలోని నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో జరుగుతాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు బోనాఫైడ్, ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు. 19న ఉదయం 9 గంటలకు విద్యార్థులు రిపోర్టు చేయాలని కోరారు.

జల్..



కుమురం భీం జలాశయంలో ధనోరా ఇన్‌టేక్‌వెల్ వద్ద వర్షం వస్తే పేరుకుంటున్న బురద

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతవాసులకు కుమురం భీం జిల్లా ధనోరా ఇన్‌టేక్‌వెల్ నుంచి తాగునీటి సరఫరా జరుగుతోంది. 220 గ్రామాలకు వైఎస్ ప్రభుత్వ హయాంలో పైప్‌లైన్ వేశారు. రూ. 70 కోట్లు వెచ్చించారు. 2017-2020 వరకు పలుమార్లు మరమ్మతుల పేరుతో రూ. 22 కోట్లు వెచ్చించారు. కుమురం భీం జలాశయంలోని ఇంటెక్‌వెల్‌లో (42 ఎంఎల్‌డీ-మిలియన్ లీటర్ పర్‌డే) చిన్నపాటి వర్షం వచ్చినా బురద పేరుకుంటుంది. ఇక్కడ మరో ఇన్‌టేక్‌వెల్, పైప్‌లైన్ మరమ్మతులకు ప్రభుత్వం మార్చిలో రూ. 60 కోట్లు మంజూరు చేసినా.. పనులు ప్రారంభం కాలేదు. వందలాది గిరిజన గ్రామాల ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు.

జంగల్..

ఆదివాసీలు చేసుకునే ప్రతి పండగ అడవితో ముడిపడి ఉంటుంది. నాలుగు జిల్లాల పరిధిలో కవ్వాల్ పులుల అభయారణ్యం విస్తరించి ఉంది. కోర్, బఫర్ ఏరియాలతోపాటు, మైదాన ప్రాంతాల్లో పల్లెలు విస్తరించి ఉన్నాయి. పులుల కదలికల నేపథ్యంలో అటవీ అధికారులు తీవ్రమైన ఆంక్షలు పెడుతుండటంతో.. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కవ్వాల్ అటవీ ప్రాంతం:
కోర్ ఏరియా: 822.23 చ.కి.మీ.
బఫర్ ఏరియా: 1123.21 చ.కి.మీ.
బఫర్ ఏరియాలో గ్రామాలు: 42

జమీన్..

మొదటి నుంచి గిరిజనుల జీవనాధారం పోడు వ్యవసాయం. 2008, 2023 లో పోడుదారులకు ప్రభుత్వాలు అటవీ హక్కు పత్రాలు అందజేసినా, ఇప్పటికీ రాని వారు ఉమ్మడి జిల్లాలో అనేకం. వీరందరూ రైతు భరోసా, బీమా పథకాలకు దూరమవుతున్నారు. కుటుంబ సభ్యులకు విరాసత్ సైతం కావడం లేదు. వెబ్‌సైట్‌లో పలు సాంకేతిక సమస్యలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

గిరిజనులకు ఇంకా అందాల్సిన పోడు పట్టాలు: 33,885
సాగు చేస్తున్న భూమి: 1.24 లక్షల ఎకరాలు

భీం నినాదం.. అమలుకు దూరం!



ఈనాడు, ఆసిఫాబాద్

జల్, జంగల్, జమీన్ నినాద సాధనే లక్ష్యంగా, ఆదివాసీల అభ్యున్నతే ధ్యేయంగా ప్రాణాలను త్యజించిన పోరాట యోధుడు కుమురం భీం 84వ వర్ధంతికి పోరాటాల పురిటిగడ్డ జోడేఘాట్ సన్నద్ధమైంది. 'మావనాటే మావరాజ్' (మా ఊరిలో మా రాజ్య స్థాపనే) ధ్యేయంగా భీం 12 గ్రామాలను ఒక్కటి చేసి తుడుం మోగించారు. వీటినే పోరు గ్రామాలుగా పిలుస్తారు. భీం ప్రాణత్యాగంతో కొంత మేరకు ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆయన లక్ష్యం ఇప్పటికీ దూరంగానే ఉంది.

పోరు గ్రామాల అవస్థలు..

కెరమెరి మండలంలోని టోకెన్‌మోవాడ్, లైన్‌పటార్, బాబేఝరి, శివగూడ, పిట్టగూడ, కల్లెగాం, పట్నాపూర్, చాల్‌బడి, పాటగూడ, చిన్న పట్నాపూర్, గోండుగూడ, కొపగూడలు.. పోరు గ్రామాలుగా కాగా వీటి పరిధిలో 2800 వరకు జనాభా ఉంది. లైన్‌పటార్, పిట్టగూడ గ్రామాలకు ఇప్పటికీ రహదారి సౌకర్యం లేదు. చాల్‌బడి, పాటగూడది ఇదే పరిస్థితి. శివగూడ, పిట్టగూడ ప్రజలకు నిత్యం, వేసవి వచ్చిందంటే మిగతా గ్రామవాసులకు తాగునీటికి చెలమలు లేదా వాగుల వద్దకు పరుగులు పెట్టాల్సిందే. నాలుగేళ్ల కిందట జోడేఘాట్‌లో 31 ఇళ్లు మంజూరు కాగా నేటికీ పూర్తి కాలేదు. హట్టి నుంచి జోడేఘాట్‌కు వెళ్లే మార్గంలో 8 కి.మీ. రోడ్డు అటవీ అనుమతులు లేక నిలిచిపోయాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో	
గిరిజన జనాభా:	4.95 లక్షలు
గిరిజన మండలాలు:	38
గ్రామాలు:	1758
అనుబంధ గ్రామాలు:	3,859



లైన్‌పటార్‌కు వెళ్లే దారి రాళ్లతో నిండి..



శివగూడలో చెలమ నీటిని తీసుకుంటున్న ప్రజలు




కౌన్సెలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

విధుల్లో బాధ్యతాయుతంగా ఉండాలి : కలెక్టర్

మంచిర్యాల విద్యావిభాగం: డీఎస్సీ-2024లో కొలువులకు ఎంపికైన వారికి మంగళవారం కౌన్సెలింగ్‌ను చేపట్టారు. ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు బుధవారం ఆయా పాఠశాలల్లో చేరనున్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ హాజరై అధికారులకు పలు సూచనలు అందించారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. భావితరాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయ వృత్తి ప్రధానమైందని, నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులు విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రతి విద్యార్థిలో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చేలా వారి ఉన్నత భవిష్యత్తుకు తోడ్పాటు అందించాలన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని కోరారు.

తొలుత నిరాశ.. ఆపై ఆనందం 7లో



(c) eenadu



జానకి షర్మిల, ఎస్పీ

ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్.. వేదికేదైతేనేం చాలామంది తమ అభిరుచికి అనుగుణంగా చిన్నచిన్న వీడియోలు, ఫొటోలతో ప్రపంచం ముందుకొస్తున్నారు. తమ అనుభవాలను పంచుకుంటున్నారు. కళాతృష్ణను తీర్చుకుంటున్నారు. కాస్త సృజనాత్మకతను జోడించి ప్రత్యేకంగా నిలుస్తున్నారు. ఇలాంటి వ్యక్తుల్లో మీరూ ఉన్నారా.. అయితే ఈ అవకాశం మీకోసమే. పోలీసు అమరవీరుల సంస్మరణ ఉత్సవాలను పురస్కరించుకొని ఔత్సాహికుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు, పోలీసుశాఖ సేవలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహిస్తున్నారు. - న్యూస్‌టుడే, నిర్మల్ పట్టణం

చిత్రం తీస్తారా.. లఘుచిత్రం రూపొందిస్తారా..!

● పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోటీలు

ఏం చేయాలంటే..

అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఏటా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టనుంది. ఫొటో-వీడియోగ్రాఫర్లతో పాటు విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు జరపనుంది. పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభను తెలిపేలా ఇటీవల కాలంలో తీసిన 3 ఫొటోలు, 3 నిమిషాల్లోపు నిడివితో ఉన్న లఘుచిత్రాలు రూపొందించి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించొచ్చు. వీటిని పెన్‌డ్రైవ్‌లో వేసి, ఫొటోలు 10/8 పరిమాణంలో సిద్ధం చేయాలి. మూఢనమ్మకాలు-ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తిప్రతిష్ఠలు, సైబర్‌నేరాలు- ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మత్తుపదార్థాల వినియోగం- కలిగే అనర్థాలపై గత సంవత్సరం అక్టోబరు నుంచి ఈ సంవత్సరం అక్టోబరు వరకు తీసిన ఫొటోలు, లఘుచిత్రాలు పోటీలకు పంపించేందుకు అవకాశముంది. జిల్లాస్థాయిలో తొలి మూడుస్థానాల్లో నిలిచిన వాటిని రాష్ట్రస్థాయికి పంపించనున్నారు. అక్కడ గెలుపొందిన వారికి నగదు పురస్కారం లభిస్తుంది.

ప్రతిభ చాటుకునే అవకాశం


మావోయిస్టులు, టెర్రరిస్టులు, సంఘవ్యతిరేకశక్తులతో పోరాడే క్రమంలో అమరులైన వారి త్యాగాలను స్మరిస్తూ ఏటా వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా పలురకాల పోటీలు నిర్వహిస్తుంటాం. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన వారికి బహుమతులు, ప్రోత్సాహకాలు అందజేస్తాం. తీసిన చిత్రాలు, రూపొందించిన లఘుచిత్రాలను జిల్లా పోలీసు కార్యాలయంలోని ఐటీ కోర్ విభాగంలో ఈనెల 20 లోపు అందజేయాలి. ఏవైనా సందేహాలుంటే చరవాణి 87125 77719లో సంప్రదించాలి.

-డా.జి.జానకి షర్మిల, ఎస్పీ, నిర్మల్

ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు

ఇంటర్మీడియట్ వరకు ఉన్న విద్యార్థులు విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్ వినియోగం, డిగ్రీ ఆపైన విద్యార్థులకు తెలంగాణను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశాలపై ఆన్‌లైన్ వేదికగా వ్యాసరచన పోటీలుంటాయి. తెలుగు, ఆంగ్లం, ఉర్దూమాధ్యమాల్లో రాసేందుకు అవకాశముంది. విద్యార్థులు తాము రాసిన వ్యాసాలను nirmalitct@gmail.com కి అక్టోబరు 20 లోపు మెయిల్ చేయాలి. ఉత్తమంగా ఉన్న వాటిని ఎంపికచేసి బహుమతులు అందజేస్తారు. అత్యుత్తమంగా ఉన్నవాటిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేస్తారు.

గిజిగాడు.. సాహసికుడు!



పిచ్చుకలు తమ సంతాన రక్షణకు నిర్మించుకునే గూళ్లలో చూపించే నైపుణ్యం ఆశ్చర్యం కలిగిస్తుంది. కుంటలు, చెరువుల్లోకి వంగిన చెట్ల కొమ్మలకు సమూహాలుగా ఒకేచోట వేలాడేలా నిర్మించుకుంటాయి. మరికొన్ని గిజిగాని సమూహాలు మాత్రం ఒక అడుగు ముందుకేసి పాములు ఇతర శత్రువుల బారి నుంచి గుడ్లు, పిల్లల్ని కాపాడుకునేందుకు ఏకంగా కరెంటు తీగలకు గూళ్లు అల్లుకుంటాయి. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి - డ్యాంగాపూర్ గ్రామాల మధ్య పచ్చని పంట పొలాలపై ఉన్న విద్యుత్తు తీగలకు పక్షులు వందల సంఖ్యలో గూళ్లు నిర్మించుకున్నాయి. దారిన పోయేవారికి కరెంటు తీగలకు తోరణాలు కట్టారా అన్నంత గుంపులుగా ఉన్నాయి.

- చిత్రం: న్యూస్‌టుడే, నిర్మల్

ఈ యువకులు సాంస్కృతిక వారసులు



తయారు చేసిన గుస్సాడీ టోపీతో మడావి సోను



టోపీ తయారు చేస్తున్న సెడ్మకీ కొండు

లింగాపూర్, న్యూస్‌టుడే: దీపావళి సమీపిస్తుండటంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ గూడేల్లో దండారీ ఉత్సవాల సందడి మొదలైంది. ఆదివాసీ గిరిజన జీవనశైలి, సంస్కృతి ప్రతిబింబించే పండగల్లో ప్రధానమైంది దండారీ వేడుక. ప్రత్యేకంగా నెమలి ఈకలతో తయారుచేసిన టోపీలు ధరించి గుస్సాడీ వేషధారణలతో ఈ పండగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీ. పండగకు కొన్ని రోజుల ముందు నుంచే గూడేల్లో కోలాహలం ప్రారంభమవుతుంది. నెమలి ఈకలు సేకరించి టోపీలు తయారు చేయడంలో పలువురు పెద్దలు ప్రత్యేకత చాటుకుంటున్నారు. పెద్దల నుంచి తయారీలో మెళకువలు నేర్చుకుని ఓవైపు జీవనోపాధితోపాటు మరోవైపు సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ఆచరిస్తూ వారసత్వ సంపదను కాపాడుకుంటున్నారు.. కుమురంభీం జిల్లా లింగాపూర్ మండలం పిట్టగూడ గ్రామానికి చెందిన యువకులు సెడ్మకీ కొండు, మాడావి సోను. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇంటర్ పూర్తయిన తర్వాత పైచదువులకు వెళ్లలేకపోయారు. తమ కాళ్ల మీద తాము నిలబడాలనే ఉద్దేశంతో టోపీల తయారీపై దృష్టి పెట్టి ఉన్న ఊళ్లోనే ఉపాధి పొందుతున్నారు. ఏటా ఉత్సవాలకు 150-200 వరకు టోపీలు తయారు చేస్తుంటారు. ఉమ్మడి జిల్లాతో పాటు జగిత్యాల, మహారాష్ట్రలోని పలు జిల్లాలకు గుస్సాడీ టోపీలను తయారు చేసి పంపిస్తున్నారు. ఒక టోపి తయారీకి రూ.2500 నుంచి రూ.3 వేలు తీసుకుంటున్నట్లు వారు చెప్పారు.

పత్తి విక్రయాల్లో సాంకేతికత

● అందుబాటులోకి వాట్సాప్ నెంబరు 88972 81111

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం :



పత్తి విక్రయాల సమాచారం తెలుసుకునేందుకు వీలుగా ఈ సీజన్‌లో మార్కెట్ అధికారులు సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చారు. గతంతో పత్తిని ఎక్కడ, ఎంత మొత్తం విక్రయించాలి, డబ్బులు ఎప్పుడు బ్యాంకులో జమ చేస్తారనే సమాచారం కోసం రైతులు ఇబ్బందులు పడేవారు. పత్తి క్రయవిక్రయాల్లో అక్రమాలను అరికట్టడంతో పాటు, రైతులు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేందుకు వీలుగా వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. రైతులు వాట్సాప్ నెంబరును నమోదు చేసుకొని 'హాయ్' అని సందేశం పంపడంతో పాటు తమ ఆధార్‌కార్డు నమోదు చేస్తే కావాల్సిన సమాచారం తెలుసుకునే అవకాశం ఉంది. ఇంకేందుకు ఆలస్యం పత్తి రైతులు 88972 81111 నెంబరును నమోదు చేసుకోండి.

ఉమ్మడి జిల్లాలో 9 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుంది.. ఈ లెక్కన ఈ సీజన్‌లో 68 లక్షల క్వింటాళ్ల పత్తి మార్కెట్లకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. రైతుల సమస్యలకు పరిష్కారంగా వన్ సాఫ్ట్‌వేర్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. పత్తి విక్రయాలు, అర్హత, అమ్మకాల వివరాలు, తక్‌పట్టి, చెల్లింపు స్థితి, సీసీఐ కేంద్రాల్లో వేచి ఉండే సమయం, కొనుగోలు వివరాలు తదితర వాటిని తెలుసుకునే వీలుంది. పంట సమగ్ర సర్వే, బ్యాంకు, ఆధార్ కార్డుతో అనుసంధానం ఉన్న చరవాణి నెంబరుతో వాట్సాప్ సేవలను పొందే అవకాశం ఉంది.

సమస్త సమాచారం

- గజానంద్, డీఎంఓ, ఆదిలాబాద్

పత్తి విక్రయాలకు సంబంధించి సమస్త సమాచారం తెలుసుకునేందుకు వీలుగా ఈ సీజన్‌లో వాట్సాప్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



రూ. 7 రుసుం.. చెల్లించటం ఎంత కష్టమో

ఈటీవీ - ఆదిలాబాద్ :



రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంఘాలు, పొరుగు సేవల సిబ్బంది, ప్రైవేటు విద్యా, వైద్య సంస్థలు, జిన్నింగ్ పరిశ్రమలు సహా అన్ని రకాల దుకాణాల్లో పని చేసే సంఘటిత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా 1987 నుంచి ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ నిధి చట్టం అందుబాటులోకి వచ్చింది. 2014లో తెలంగాణ కార్మిక సంక్షేమ మండలిగా రూపాంతరం చెందినా కార్మికుల సంక్షేమం గాలిలో దీపంలా మారింది. కార్మికుల వివాహ కానుక, విద్యా ప్రోత్సాహకాలు, దివ్యాంగులైన కార్మికుల పిల్లలకు విద్యా ప్రోత్సాహకాలు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స ఖర్చులు, ప్రమాద, సహజ మరణాల్లో అందించాల్సిన పరిహారమంతా నామమాత్రంగా మారింది.

పట్టింపు శూన్యం

కార్మిక సంక్షేమ మండలి ద్వారా ప్రభుత్వం అమలు చేసే పథకాలపై అవగాహన కొరవడుతోంది. ఏడాదికి కార్మికుడి వాటా రూ.2, సంస్థ వాటా రూ.5 చొప్పున రూ.7 చెల్లిస్తేనే కార్మిక మండలి నిధికి చెల్లిస్తే ప్రభుత్వం అమలు చేసే ప్రోత్సాహకాలను పొందటానికి ఆస్కారముంటుంది. కార్మికశాఖ సహా వివిధ సంస్థల పట్టింపులేనితనంతో కార్మిక మండలి నిధి సరిగా అమలు కావటం లేదు. ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు పరిశ్రమలు, ఇతర సంస్థల్లో ఎంత మంది కార్మికులు పని చేస్తున్నారనేది నిర్దిష్టంగా తేలటం లేదు. కార్మికశాఖలో పేర్లు నమోదు చేసుకున్న వివరాల ప్రకారం కేవలం 13,903 దుకాణాల్లో 40,026 మంది కార్మికులు పని చేస్తున్నట్లు తేలింది. మిగిలిన పరిశ్రమలు, సంస్థల పేర్ల నమోదు పట్టింపులేని అంశంగా మారింది.

కార్మికుడి వాటా రూ.2, పని చేసే సంస్థ వాటా రూ.5. రెండూ కలిపితే రూ.7 అవుతుంది. వాటిని ఏడాదికోసారి కార్మిక మండలి నిధికి చెల్లిస్తే కొంత లబ్ధి చేకూరుతుంది. కానీ అవి చెల్లించకపోవటంతో సంక్షేమ ప్రయోజనాలు కార్మికులకు చేకూరడం లేదు. కార్మిక మండలి ద్వారా చెల్లించే ప్రోత్సాహకాలే తక్కువ నుకుంటే వాటికీ నోచుకోలేని సంఘటిత కార్మికుల దయనీయత వెల్లడించే వ్య(క)థ ఇది.

● సంఘటిత కార్మికుల దరిచేరని సంక్షేమం

ఏపీలో భేష్

ఆంధ్రప్రదేశ్‌లో కార్మికుడి వాటా రూ.30, సంస్థ వాటా రూ.70 చొప్పున ఏడాదికి రూ.100 చెల్లించటంతో కార్మికులకు భరోసా కనిపిస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులకు రూ.50 వేలు, ప్రమాద మరణమైతే రూ.5 లక్షలు, ప్రమాదంతో వచ్చే అంగవైకల్యానికి రూ.1.25 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు సాయం లభిస్తోంది. ఏపీలో అమలు చేసినట్లు ప్రోత్సాహకాలు అందిస్తే పేద కార్మికులకు మేలు కలుగుతుంది.

అనేక ప్రయోజనాలున్నా..

కార్మిక శాఖలో దుకాణం పేరు నమోదై ఉంటే కార్మికులు దీర్ఘకాలిక వ్యాధులకు గురైతే చికిత్సకు రూ.20 వేల సాయం పొందొచ్చు. ప్రమాదంలో చనిపోతే రూ.30 వేలు, సహజ మరణమైతే రూ.10 వేలు, అంత్యక్రియలకు రూ.5 వేలు, అంగవైకల్యం బారినపడితే రూ.10 వేల నుంచి రూ.20 వేల సాయం పొందొచ్చు. పెళ్లి కానుకగా రూ.10 వేలు, ప్రసూతి సాయం రూ.5వేలు, పిల్లల ఉపకార వేతనాలుగా రూ.1000 నుంచి రూ.2 వేల వరకు లబ్ధి చేకూరుతుంది

పాలకుల తప్పిదమే



ఆంధ్రప్రదేశ్‌తో పోల్చుకుంటే రాష్ట్రంలో కార్మికులకు ప్రయోజనమేం కలగటం లేదు. ప్రశ్నించలేనితనం కార్మికులదైతే, పట్టింపులేనితనం సంస్థలది. అందుకే విశ్రాంత అధికారిగా ఈ నెల 16న కార్మిక భేరి ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

- జగదీశ్వర్‌రెడ్డి, విశ్రాంత కార్మిక శాఖాధికారి

జిల్లాల వారీగా పేర్లు నమోదు చేసుకున్న దుకాణాలు, కార్మికుల వివరాలు (● జిల్లా ● దుకాణాలు ● కార్మికులు)

జిల్లా	దుకాణాలు	కార్మికులు
ఆదిలాబాద్	2650	7650
నిర్మల్	2380	6860
మంచిర్యాల	7250	20753
ఆసిఫాబాద్	1623	4763

గురుకుల భవనాలకు తాళం వేసిన యజమానులపై కేసు

తాండూరు: మహాత్మా గాంధీ జ్యోతిబాపులే బీసీ గురుకుల పాఠశాల కొనసాగుతున్న ప్రైవేటు భవనానికి అద్దె చెల్లించడం లేదని యజమాని శరత్‌కుమార్ మంగళవారం ఉదయం ప్రధాన ద్వారానికి తాళం వేశారు. యజమాని మాట్లాడుతూ 9 నెలలుగా అద్దె చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అద్దె చెల్లించే వరకు తాళాలు తీయనని తెలిపారు. పాఠశాలకు తాళం వేయడంతో సిబ్బందితోపాటు విద్యార్థులు ఇబ్బందులు పడ్డట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వినోద్‌కుమార్ తాండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో భవన యజమాని శరత్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

బెల్లంపల్లి పట్టణం: మహాత్మాగాంధీ జ్యోతిబాపులే బీసీ వెల్ఫేర్ పాఠశాల, జూనియర్ కళాశాల అద్దె భవనానికి తాళం వేసిన యజమాని రుషిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ దేవయ్య తెలిపారు. పాఠశాల భవనానికి తాళం వేయడంతో బోధన సిబ్బంది, విద్యార్థులు ఇబ్బంది పడ్డారని ప్రిన్సిపల్ పి.రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

అర్చకుల కొరత.. అక్షరాభ్యాసాలకే సుముఖత

● బాసర క్షేత్రంలో కొరవడుతున్న పర్యవేక్షణ

ఈటీవీ- ఆదిలాబాద్: బాసర జ్ఞాన సరస్వతీ క్షేత్రంలో అర్చకుల కొరత పూజాది కార్యక్రమాలకు ప్రతిబంధకంగా మారుతోంది. అమ్మవారి అభిషేకం, అర్చనలో కీలకమైన వేదపండితులు సహా సాధారణ అర్చకులు చాలినంత మంది లేక ఇబ్బందులకు దారి తీస్తోంది. చదువులమ్మ ఆలయం ఇన్‌ఛార్జి ఈవో పర్యవేక్షణలో కొనసాగుతోంది. రెగ్యులర్ ఈవోగా ఉన్న విజయరామారావును మే నెలలో ప్రభుత్వం నిజామాబాద్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేసింది. బాసర ఇన్‌ఛార్జి ఈవోగా పరిమితం చేయడంతో పర్యవేక్షణ పట్టుతప్పుతోంది.

బాసరలో అమ్మవారి అభిషేకంలో వేద పండితులు, అక్షరాభ్యాసాల్లో అర్చకుల పాత్ర కీలకం. సరిపడినంత మంది వేద పండితులు, అర్చకులు లేనందున విధుల నిర్వహణపై ప్రభావం పడుతోంది. ప్రభుత్వం మంజూరు చేసిన ఎనిమిది మంది వేద పండితులకు నలుగురితోనే సరిపెట్టుకుంటున్నారు. మరో నాలుగు పోస్టులు భర్తీ కావడం లేదు. పూజాది కార్యక్రమాలతోపాటు అక్షరాభ్యాసాలకు 21 అర్చకుల పోస్టులకు 15 మందితోనే కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ఫలితంగా ప్రత్యేక పూజాది కార్యక్రమాలతో కూడిన విధుల నిర్వహణ కన్నా వ్యక్తిగత ఆదాయం సమకూరుతుందనే ఆలోచనతో అక్షరాభ్యాసాల విధుల కోసం కొంతమంది అర్చకులు పట్టుబడుతుండటంతో అంతర్గత వివాదాలకు కారణమవుతోంది. ఇటీవల హారతిలో డబ్బులు వేసే సంప్రదాయాన్ని అధికారులు రద్దు చేశారు. అక్షరాభ్యాసాలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చిన తర్వాత కనీసం కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన రెగ్యులర్ ఉద్యోగి లేక కాంట్రాక్టు పద్ధతిలో ఒకరిని నియమించుకోవాల్సి వచ్చింది. ఈ విషయమై ఇన్‌ఛార్జీ ఈవో విజయరామారావును సంప్రదించగా ఖాళీల కారణంగా పూజాది కార్యక్రమాలపై ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేదపండితులు, అర్చకులు కలిపి మరో 10 మందిని నియమిస్తే ఏ ఇబ్బంది ఉండదని తెలిపారు.

తమ్ముడి తలపై కర్రతో కొట్టిన అన్న

● చికిత్స పొందుతూ మృతి

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చిన్నపాటి సమస్యకే అన్నదమ్ములిద్దరూ గొడవ పడ్డారు. క్షణికావేశంలో అన్న కర్రతో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన తమ్ముడు కొడిపె మల్లయ్య(45) చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం అక్కేపల్లికి చెందిన కొడిపె భీమయ్య, మల్లయ్యలు అన్నదమ్ములుకాగా మద్యం తాగి తరచూ ఘర్షణ పడుతుండేవారు. ఈ నెల 13న రాత్రి బాత్రూం నీళ్ల విషయంలో అన్నదమ్ములిద్దరూ గొడవ పడ్డారు. ఆవేశంలో భీమయ్య మల్లయ్య తలపై కర్రతో బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావం అయింది. కుటుంబ సభ్యులు చెన్నూరు సామాజిక ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ రవీందర్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.





ఎడ్ల బండ్లలో వెళుతున్న ఆదివాసీ మహిళలు, పోరాట యోధుడి పాటపై ర్యాలీ చిత్రీకరణ దృశ్యాలు

గోండు వీరుడి గాథపై ప్రత్యేక గీతం

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : కుమురం భీం పోరాటం, జీవిత చరిత్రను ప్రజలకు చేరువ చేసేందుకు ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా ప్రత్యేక గీతాన్ని రూపొందించారు. ఆమె పర్యవేక్షణలో నాడు భీం చేసిన పోరాటంపై ప్రత్యేకంగా చిత్రీకరించారు. పీఓ పర్యవేక్షణలో రాసిన 'తెలంగాణ ముద్దు బిడ్డా.. మన గిరిజన గోండు బిడ్డా' అనే గీతంపై ఇంద్రవెల్లి మండలం తుమ్మగూడ గోండులతో పరిసర ప్రాంతాల్లో నృత్య ప్రదర్శనను చిత్రీకరించారు. కెరమెరి మండలం జోడేఘాట్ పరిసర ప్రాంతంలో రజాకార్ల సైనికులపై కుమురం భీం చేసిన పోరాట దృశ్యాలను సైతం చిత్రీకరించారు. 17న వర్ధంతి రోజు గీతాన్ని ఆవిష్కరించి గిరిజన గ్రామాలలో ప్రదర్శించేందుకు పీఓ ప్రణాళిక సిద్ధం చేశారు.

EDUCATION

MBA/ MCA Management Quota Seats are available, Interested Candidates may Contact: 98662 97888, 63015 19880.

FINANCIAL SERVICES

TVS క్రెడిట్ సర్వీసెస్ లి.లో యూజ్‌డ్ కార్స్, రిఫైనాన్స్ & బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ లోన్స్ అతి తక్కువ వడ్డీ రేటులో ఇవ్వబడును. అతి తక్కువ డాక్యుమెంటేషన్. సెల్: 91001 11717, 91001 11716

Book Your 5 Lines Classified Advertisement for
B & W Rs. 300/- Only
Colour Rs. 350/- Only
GST 5% Applicable in Classifieds on any day
For further details Contact:
Adilabad:
99590 97631
90005 66042

EENADU Classifieds

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, ANEES BEGUM SHAIK (Old Name), R/o. H.No. 3-60/1, Ambakanti (V), Kuntala (M), Nirmal, T.S., have changed My Name as ANEES BEGUM (New Name) W/o. SHAIK AMEERODDIN.

PEOPLE CARE

OLD AGE HOME

ఒమేగా హోంకేర్ వంట / ఇంటిపని, వృద్ధులను, పేషెంట్లని, చిన్నపిల్లలను 24 గం|| చూసుకొనుటకు మీ ఇంటి వద్దకే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. ✆ 89776 39664, 89776 39665.

JOBS

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషెంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 96402 58899, 96404 68899.

శ్రీనివాస హోమ్‌కేర్‌లో పెద్దవారికి సేవలు చేయుటకు Exp. స్త్రీ/పురుషులు/ నర్సులు కావలెను. జీతం: 20,000/- నుండి 25,000/- వరకు ఇవ్వబడును. Hyd. లో. ✆ 6301330889, 6300799407.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99590 97631 90005 66042
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80083 42688



గుడిపేట పటాలంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కమాండెంట్ వెంకటరాములు



గుడిపేట పటాలంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

అట్టహాసంగా క్రీడా సంబరం

హాజీపూర్, న్యూస్‌టుడే: మండలంలోని గుడిపేట పోలీసు పటాలంలో మంగళవారం వార్షిక స్పోర్ట్స్‌మీట్ పోటీలను కమాండెంట్ వెంకటరాములు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం అనేక సవాళ్లతో కూడిన విధులు నిర్వహించే పోలీసులకు మానసికంగా, శారీరకంగా నూతనోత్తేజం కల్పించేందుకు ఈ క్రీడలు ఉపయోగపడనున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు పటాలంలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి పరుగు పందెం, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, టగ్‌ఆఫ్ వార్ వంటి పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. అసిస్టెంట్ కమాండెంట్‌లు నాగేశ్వర్‌రావు, కాళీదాస్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన సబ్ జూనియర్ విద్యార్థినులు నాగేశ్వరి, వైష్ణవి, నందిని, సరోజ



జూనియర్ విద్యార్థినులు సోని, జంగుబాయి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం జంగు, గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి తెలిపారు. ఈ నెల 9న నల్గొండలో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఖోఖో ఎంపిక పోటీల్లో క్రీడా పాఠశాల విద్యార్థినులు సబ్ జూనియర్ బాలికల విభాగంలో నాగేశ్వరి, వైష్ణవి, నందిని, సరోజ, జూనియర్ విభాగంలో సోని, జంగుబాయిలు అత్యుత్తమ ప్రతిభ చాటి ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఈ నెల 16, 17 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు నుంచి ఆడనున్నట్లు వివరించారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థినులను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, తదితరులు అభినందించారు.

పర్వతారోహణ శిక్షణ శిబిరానికి మనోళ్లు

మామడ, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ నెల 16 నుంచి 27 వరకు జరిగే జాతీయ స్థాయి పర్వతారోహణ శిక్షణ శిబిరం(ఆర్‌సీటీసీ)లో పాల్గొనే అరుదైన అవకాశం జిల్లా నుంచి ముగ్గురికి వచ్చింది. మామడ మండలం పొన్కల్ జడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారి పూర్ణచందర్ నేతృత్వంలో నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కడెం జడ్పీహెచ్‌ఎస్ కేడెట్‌లు వసంత్, సుమంత్ ఈ శిబిరంలో పాల్గొననున్నారు. దేశ వ్యాప్తంగా 9 ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుంచి 273 మంది కేడెట్లు ఆర్‌సీటీసీలో శిక్షణ పొందనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం 28 మందికే ఈ అవకాశం దక్కింది. ఈ శిక్షణ శిబిరంలో పర్వతారోహణలో ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఆత్మవిశ్వాసం, జట్టుస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై మిలటరీ అధికారులు శిక్షణనిస్తారు. ఈ మేరకు పూర్ణచందర్, వసంత్, సుమంత్ మంగళవారం గ్వాలియర్‌కు బయలు దేరారు.



గ్వాలియర్ వెళ్తున్న ఎన్‌సీసీ అధికారి, కేడెట్లు

ఓటుహక్కు నమోదుకు ప్రత్యేక కౌంటరు

ఖానాపూర్, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు పట్టభద్రుల ఓటు నమోదుకు తహసీల్దార్ కార్యాలయంలో కౌంటరు ఏర్పాటు చేశామని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. 2021 నవంబరు 1 లోపు డిగ్రీపూర్తిచేసిన అభ్యర్థులు ఫారం-18, 19లలో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే అవకాశముందని తెలిపారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

కోటపల్లి, న్యూస్‌టుడే:

? కోటపల్లి నుంచి మల్లంపేట్ మార్గమధ్యలోని మూలమలుపు వద్ద ఏర్పాటు చేసిన ప్రమాద సూచిక నామఫలకం చుట్టూ పిచ్చి మొక్కలు కమ్మేశాయి. రాత్రి వేళ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. - శ్యామ్, ప్రయాణికుడు

✔ రెండు రోజుల్లోగా పిచ్చి మొక్కలు తొలగించి నామఫలకం కనిపించేలా చర్యలు తీసుకుంటాం. - సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని బూడిదగడ్డబస్తీలో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోతుంది. రోడ్డు మీదకు చెత్త వచ్చి అపరిశుభ్రంగా మారుతుంది. - సతీష్, బూడిదగడ్డబస్తీ

✔ పట్టణంలో ప్రతి రోజు చెత్తను తొలగిస్తున్నాం. బూడిదగడ్డబస్తీలో చెత్త తొలగిస్తాం. - వైకుంఠం, పారిశుద్ధ్య అధికారి

కన్నెపల్లి, న్యూస్‌టుడే:

? కన్నెపల్లి మండలంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు రక్షణ లేక పశువులు మేస్తున్నాయి. - స్థానికులు

✔ మొక్కలకు రక్షణ కోసం కంచె ఏర్పాటు చేస్తాం. - శ్రీనివాస్, ఏపీఓ కన్నెపల్లి

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:

? మంచిర్యాలలోని రైల్వే ఎత్తువంతెనపై మధ్యలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రి వాహనాదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. - రాంరెడ్డి, మంచిర్యాల

✔ మూడు రోజుల్లో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయిస్తాం. -మసూద్ అలీ, మున్సిపల్ ఇంజినీరు, మంచిర్యాల

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:

? మండలంలోని కన్నెపల్లిలో మురుగు కాల్వలు చెత్త చెదారంతోపాటు మురుగు నీటితో నిండిపోయాయి. మురుగు నీరు ఎక్కడికక్కడే నిలుస్తోంది. - దేవేందర్, కన్నెపల్లి

✔ వారం రోజుల్లో మురుగు కాల్వలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. - సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి, కన్నెపల్లి

కలాం సేవలు చిరస్మరణీయం



కోటపల్లి: అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేస్తోన్న విద్యార్థులు



గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో..



జన్నారంలో..



మందమర్రి: మనోవికాస్ విద్యార్థులకు కేక్ తినిపిస్తున్న యువజన కాంగ్రెస్ కార్యదర్శి మహంత్ అర్జున్

జిల్లావ్యాప్తంగా భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం ఘనంగా పాఠశాలల్లో నిర్వహించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయసాధన కోసం కృషి చేయాలని పలువురు కోరారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. – న్యూస్‌టుడే, బృందం



భీమారంలో.. రాష్ట్ర గొర్రె, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్

తొలుత నిరాశ.. ఆపై ఆనందం

● నేటి నుంచి బడులకు కొత్త ఉపాధ్యాయులు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో ఎంపికైన అభ్యర్థుల ఏళ్ల కల నెరవేరింది. కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టి విద్యార్థులకు పాఠాలు చెప్పే తరుణం రానే వచ్చింది. జిల్లాలో ఉపాధ్యాయుల పోస్టుల కొలువులకు ఎంపికైన వారికి మంగళవారం కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో పోస్టులను కేటాయించారు. తొలుత ఉదయం 10 గంటలకే ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించిన తర్వాత వాయిదా వేస్తున్నట్లు సంకేతాలు రావడంతో ఎంపికైన అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ప్రక్రియ చేపట్టాలంటూ రాష్ట్ర విద్యాశాఖ నుంచి డీఈవోలకు ఆదేశాలు రావడంతో మధ్యాహ్నం నుంచి కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టర్ కుమార్ దీపక్ ఈ ప్రక్రియ పరిశీలించి అధికారులకు పలు సూచనలు అందించారు. ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు బుధవారం ఆయా పాఠశాలల్లో చేరనున్నారు. ప్రత్యేక విద్య పోస్టుల విషయం కోర్టు పరిధిలో ఉండటంతో 248 పోస్టులను మాత్రమే కేటాయిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. విద్యాశాఖ ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ చేపట్టి ర్యాంకుల వారీగా ఆయా స్థానాలను కేటాయించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కౌన్సిలింగ్ ప్రక్రియలో 248 మందిలో 230 మందికి మాత్రమే పాఠశాలల కేటాయింపు చేపట్టారు. ఇందులో ఎస్‌ఏలు 61 మంది, ఎస్జీటీలు 169 మంది ఉన్నారు. వివిధ కారణాలతో 18 మంది పోస్టింగ్‌లను నిలిపివేశారు. ఇటీవల పదోన్నతులు, బదిలీలు చేపట్టిన తర్వాత ప్రాథమిక స్థాయిలో ఎస్జీటీల కొరత ఎక్కువగా ఉంది. బదిలీ అయిందని సంతోషం ఉన్నా అక్కడ ఉపాధ్యాయులు లేక కొన్ని చోట్ల రిలీవర్లు లేక అదే స్థానంలో కొనసాగుతున్నారు. తాజాగా ఉపాధ్యాయులు నియామకాలు జరగడంతో అలాంటి వారికి కాస్త ఉపశమనం కలగనుంది.

డీఎస్సీ ప్రకటన పోస్టులు:	288
నియామక పత్రాలు అందుకున్నవారు	248
కౌన్సెలింగ్‌లో పాఠశాలలకు కేటాయించినవారు	230
నిలిపివేసినవి	18



హాజరైన అభ్యర్థులు

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట, న్యూస్‌టుడే: మండలంలోని ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన గణిత శాస్త్రం, రసాయనశాస్త్రం బోధించేందుకు అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ అబ్దుల్ ఖలీల్ అన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు బోధించేందుకు సంబంధింత సబ్జెక్టు ఎంఎస్సీ, బీఈడీ, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గురుకుల పాఠశాలలకు తాళం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : భవనానికి అద్దె చెల్లించడం లేదంటూ భవన యజమాని చిదిరాల భావనరుషి మహాత్మా జ్యోతిబాపులే బాలికల గురుకుల విద్యాలయానికి మంగళవారం తాళం వేశారు. గడిచిన తొమ్మిది నెలల నుంచి భవనాలకు అద్దె చెల్లించడం లేదని వాపోయారు. అద్దె విషయాన్ని ఇప్పటికే చాలా సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తాళం వేయాల్సి వచ్చిందని చెప్పారు. విద్యార్థులను ఇబ్బంది పెట్టడానికి తాళాలు వేయలేదని తెలిపారు.

మందమర్రి పట్టణం: మందమర్రి పాతబస్టాండ్‌లోని మహాత్మా జ్యోతిబాపులే గురుకుల పాఠశాల, కళాశాల భవనానికి యజమాని మంగళవారం తాళం వేశారు. ఎనిమిది నెలలుగా రూ.15 లక్షలు అద్దె రావాల్సి ఉందని యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల సిబ్బంది విజ్ఞప్తితో మంగళవారం సాయంత్రం తాళం తీసి విద్యార్థులు, సిబ్బందిని లోనికి అనుమతి ఇచ్చినట్లు యజమాని సతీష్ తెలిపారు.



మందమర్రిలో గురుకులానికి తాళం వేసి దృశ్యం

భాజపా బలోపేతానికి కృషి

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: భాజపా బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు అన్నారు. దండేపల్లి మండలం కొర్విచెల్మలో మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సంస్థలు ఎప్పుడు వచ్చినా గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు కర్నాల కిషన్, గాదె శ్రీనివాస్, దుమ్మని సత్తయ్య, వనపర్తి రాకేష్ పాల్గొన్నారు.



కొర్విచెల్మలో పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు

చర్యలు తీసుకోవాలి

దండేపల్లి, న్యూస్‌టుడే: దండేపల్లిలోని గిరిజన సబ్ డివిజన్ కార్యాలయంలో డీఈఈగా విధులు నిర్వహిస్తున్న శహెబాద్ అహ్మద్ స్థానికంగా అందుబాటులో ఉండటం లేదని, దీంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు పనులకు బిల్లులు రాక అవస్థలు పడుతున్నామని గుత్తేదారులు ఇమామ్, రామస్వామిగౌడ్, అజహరుద్దీన్, ఎండీ జైనుద్దీన్ ఆరోపించారు. మంగళవారం ఇక్కడ విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మూడేళ్ల కిందట ఆయన విధుల్లో చేరారని, అప్పటి నుంచి కార్యాలయానికి సరిగా రావడం లేదన్నారు. చిన్న చిన్న బిల్లులకు తమను తిప్పుకుంటున్నాడన్నారు. ఈ విషయమై డీఈఈని న్యూస్‌టుడే వివరణ కోరగా సరైన వసతులు లేకపోవడంతో ఇక్కడ ఉండలేకపోతున్నానని తెలిపారు.



ప్రైవేటు డిగ్రీ కళాశాలల బంద్‌కు మద్దతు తెలుపుతున్న ట్రస్మా, విద్యార్థి సంఘాల నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు నేడు ర్యాలీ, ధర్నా

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: డిగ్రీ, పీజీ కళాశాలలకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు ఈ నెల 16న జిల్లా కేంద్రంలోని శాంతియుత ర్యాలీ, రాస్తారోకో నిర్వహించనున్నట్టు జిల్లా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ నాయకులు ప్రకటించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. స్థానిక ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. పలుమార్లు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంపై ఈ నెల 14 నుంచి కళాశాలలు బంద్ పాటిస్తున్నామన్నారు. ట్రస్మా నాయకులు, ప్రైవేటు డిగ్రీ కళాశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.

రూ.పది నాణేలపై అవగాహన

హాజీపూర్, న్యూస్‌టుడే: రూ.పది నాణేలు చెల్లడం లేదంటూ వస్తున్న ఆరోపణల నేపథ్యంలో రిజర్వు బ్యాంకు ఆదేశాల మేరకు మంగళవారం హాజీపూర్ యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చిరు వ్యాపారుల దుకాణాల్లో అవగాహన కల్పించారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ సతీష్‌కుమార్ సిబ్బందితో కలిసి ప్రజల నుంచి వచ్చే రూ.10 నాణేలు చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయని వాటిని తిరస్కరించకుండా వినియోగించేలా చూడాలని అవగాహన కల్పించారు. పలువురు వ్యాపారులు రూ.లక్ష వరకు నాణేలను బ్యాంకు అధికారుల నుంచి స్వీకరించారు. బ్యాంకు సబ్ మేనేజర్ శ్రీకాంత్, రమేష్, మనోహర్, శ్రీనివాస్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



హాజీపూర్ మండల కేంద్రంలో రూ.10 నాణేలపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు ప్రతినిధులు

పక్కాగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

ఏసీసీ, న్యూస్‌టుడే: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బాలింతలు, చిన్నారులు, గర్భిణులు, కిశోర బాలికల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలను ప్రభుత్వ సొంత భవనాల్లోకి మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి కేంద్రంలో ఆహార సామగ్రి, మందులు, హాజరు పట్టికలు, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లా సంక్షేమశాఖాధికారి స్వరూపారాణి, సీడీపీవోలు రేష్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

కాసిపేట, న్యూస్‌టుడే: మండలంలోని దుబ్బగూడెం గ్రామంలో ఓ వేడుక నిర్వహించే కార్యక్రమానికి అక్రమంగా నిర్వాహకులు పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో రెండు రోజులుగా మట్టిని తరలిస్తున్నారు. ఈ మట్టి తరలించే ప్రాంతంలో సింగరేణి ఆధ్వర్యంలో వందల మొక్కలను నాటారు. ఈ మొక్కలను ధ్వంసం చేస్తూ మట్టిని తరలిస్తున్నారు. ఈ మట్టి తరలింపునకు ఓ ప్రజాప్రతినిధి సహకారం సైతం ఉందనే ఆరోపణలున్నాయి. శ్మశానవాటికకు వెళ్లేదారి కావడంతో ట్రాక్టర్ల రాకతో భారీ గుంతలు ఏర్పడ్డాయని, దీంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. ఈ విషయమై ఆర్డీవో హరికృష్ణ, ఎస్సై ప్రవీణ్‌కుమార్, జీఎం దేవేందర్‌కు సమాచారం ఇవ్వగానే అక్కడ నుంచి మట్టి తరలించేవారు జేసీబీతో వెళ్లిపోయారు. ఇదంతా చూస్తే అధికారులకు సమాచారం అందిస్తే మట్టి తరలించే వారికి ఎలా తెలిసిందో అర్థంకాని ప్రశ్న. ఇదంతా గమనిస్తే అధికారులే అక్రమ మట్టి తరలింపు వారికి సహకారం అందిస్తున్నారని తెలుస్తోంది.



ట్రాక్టర్లలో జేసీబీతో మట్టి నింపుతున్న దృశ్యం





కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : బెల్లంపల్లిలోని శాంతిఖని గని ఆవరణలో గైర్హాజరు కార్మికులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. సంస్థ నిబంధనల మేరకు ప్రతి నెల 16 మస్టర్ల కన్నా తక్కువ చేసిన కార్మికులకు అవగాహన కల్పించారు. విధులకు ఎందుకు హాజరుకావడం లేదో అడిగి తెలుసుకున్నారు. సత్యనారాయణ, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

సింగరేణి ఆసుపత్రిలో వైద్య సిబ్బందిని నియమించాలి

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వైద్య సిబ్బందిని నియమించాలని ఏరియా ఆసుపత్రి పరిరక్షణ కమిటీ నాయకులు మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. సెప్టెంబరులో ఎమ్మెల్యే వినోద్ ఇచ్చిన మాట ఏమైందని ప్రశ్నించారు. 200 పడకల ఆసుపత్రిలో వార్డులన్నీ మూసివేశారని ఆరోపించారు. ఏరియా ఆసుపత్రిని డిస్పెన్సరీ స్థాయికి దిగజార్చారని ఆరోపించారు. కార్మిక కుటుంబాలకు వైద్య సేవలు అందడం లేదన్నారు. బీపీ, షుగర్‌లాంటి జబ్బులకు మందులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. నాయకులు ఎండీ. చాంద్‌పాషా, మణిరామ్‌సింగ్, మహేందర్, నీరటి రాజన్న, గోగర్ల శంకర్, మల్లయ్య, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: అక్టోబరులో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, శ్రీరాంపూర్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

నేర వార్తలు

భవనంపై నుంచి పడి కూలీ మృతి

నస్పూర్, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు రెండంతస్తుల భవనంపై నుంచి పడి కూలీ మృతి చెందిన ఘటన నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం బాలఘాట్ జిల్లా కాల్‌పత్రి గ్రామానికి చెందిన నీరజ్ బిసెన్(35) భార్య కల్పనతో కలిసి బతుకుదెరువు కోసం ఏడాది క్రితం నస్పూర్‌కు వచ్చాడు. అద్దె గదిలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. మంగళవారం సీసీసీ కార్నర్ వద్ద ఓ భవనం రెండవ అంతస్తులో నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి రామన్‌కాలనీ సమీపంలోని రైల్వేట్రాక్‌పై ప్రవీణ్‌కుమార్(36) అనే యువకుడు మంగళవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. వాంకిడికి చెందిన ప్రవీణ్ టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజులుగా మానసికస్థితి బాగా ఉండటం లేదని ఈ క్రమంలో ఇక్కడికి వచ్చి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నట్లు తెలిపారు. ప్రవీణ్‌కుమార్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నస్పూర్, న్యూస్‌టుడే: రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాలకు చెందిన సిరిగిరి సుధాకర్ జిల్లా కేంద్రం నుంచి మహారాష్ట్రకు పీడీఎస్ బియ్యంను ట్రాలీ వాహనంలో మంగళవారం తరలిస్తున్నాడు. నస్పూర్‌లో అనుమానాస్పదంగా వెళ్తున్న ట్రాలీ వాహనాన్ని తనిఖీ చేయగా అక్రమంగా రవాణా చేస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. వీటి విలువ రూ.50 వేలు ఉంటుందని సీఐ పేర్కొన్నారు. తదుపరి విచారణ నిమిత్తం సుధాకర్‌ను నస్పూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు.

చోరీ కేసులో ఒకరికి రెండేళ్ల జైలు శిక్ష

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: చోరీ కేసులో ఓ వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష పడిన ఘటన బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం ఇందిరమ్మ కాలనీకి చెందిన గడ్డం మార్కండేయ ఇంట్లో 15-09-2022న గుర్తు తెలియని వ్యక్తి చొరబడి వెండి, 1 గ్రాము బంగారం, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడు సికిందర్‌అలీని పట్టుకొని కోర్టులో హాజరుపర్చారు. బెల్లంపల్లి జేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ జె.ముఖేష్ సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో అతడికి 2 సంవత్సరాల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌ఓ దేవయ్య తెలిపారు.

రాగి తీగల దొంగల రిమాండ్

తాండూరు, న్యూస్‌టుడే: సోలార్ ప్లాంట్‌లో రాగి తీగలు దొంగతనం చేసిన అయిదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాండూరు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. తాండూరు మండలం చౌటపల్లి గ్రామ శివారులోని టాటా సోలార్ ప్లాంట్‌లోకి చొరబడి డీసీ రాగి తీగలు చోరీ చేశారని సెక్యూరిటీ సూపర్‌వైజర్ శేఖర్ ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు భీమయ్య, వెంకటేష్, రవి, సురేందర్, రాజేష్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

ప్రాణం తీసిన ఆస్తి వివాదం

మామ చేతిలో అల్లుడి హతం



నరేందర్

కన్నెపల్లి, న్యూస్‌టుడే: ఆస్తి తగాదాలు మామ అల్లుడి మధ్య చిచ్చురేపాయి. చిలికిచిలికి గాలివానలా మారాయి. ఒకానొక సమయంలో అల్లుడు అత్తమామలపై తుపాకీతో కాల్పులకు పాల్పడ్డాడు. త్రుటిలో వీరు ప్రాణాలతో బయటపడ్డారు. అనంతరం జైలుకు వెళ్లి వచ్చినా తీరు మారలేదు. మళ్లీ గొడవపడగా చివరికి మామ అల్లుడిని హత్య చేసిన ఘటన కన్నెపల్లి మండలం సాలిగా గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాలిగాంకు చెందిన గోలేటి శంకర్, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరికి 8 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వీరిలో పెద్ద కూతురు బేబీకి బెల్లంపల్లి మండలం మాలగురిజాలకు చెందిన గోమాస నరేందర్‌తో వివాహం జరిగింది. నరేందర్ కుటుంబం ఉపాధి నిమిత్తం కరీంనగర్‌లోని ఓ పేపర్ ప్లేట్ల కంపెనీలో పని చేస్తున్నారు. కొంత కాలంగా అత్తమామల ఆస్తిపై అల్లుడు నరేందర్ కన్నుపడింది. వారి ఆస్తి కోసం తరచూ గొడవపడేవాడు. ఫిబ్రవరి నెలలో అత్తమామలను చంపుతానని తుపాకీతో కాల్పులు జరిపాడు. బుల్లెట్లు గోడకు తగలడంతో అత్తమామలిద్దరూ తప్పించుకున్నారు. ఆ సమయంలో కేసు నమోదవగా మూడు నెలలపాటు జైలు జీవితం గడిపాడు. బేయిల్‌పై బయటకు వచ్చినా.. తరచూ గొడవలు చేసుకుంటున్నారు. మూడు రోజుల క్రితం భార్యను కొట్టగా ఆమెపుట్టింటికి వచ్చింది. మంగళవారం కరీంనగర్ నుంచి వచ్చిన నరేందర్ అత్తమామలను చంపుతానని బెదిరించడంతో ఆగ్రహానికి గురైన మామ శంకర్ గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు. ఘటనా స్థలాన్ని తాండూరు సర్కిల్ సీఐ కుమార స్వామి, కన్నెపల్లి ఎస్సై గంగారం పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

గంగారంలో వైద్య శిబిరం

నెన్నెల: మండలంలోని గంగారం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో విష జ్వరాలు వస్తున్నందున ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యాధికారి లక్ష్మణ్ తెలిపారు. రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు వివరించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేడు

భీమిని: భీమిని మండలం కేస్లాపూర్ గ్రామంలో బుధవారం అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ చేయనున్నట్లు అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విగ్రహ ఆవిష్కరణ చేయనున్నట్లు పేర్కొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

చెన్నూరు: చెన్నూరు సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్తుశాఖ ఆపరేషన్ ఏడీఈగా విధులు నిర్వర్తించిన రవికుమార్ బెల్లంపల్లికి బదిలీకాగా ఆయనను సోమవారం చెన్నూరు సబ్‌స్టేషన్ ఆవరణలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది సన్మానించారు. మూడున్నరేళ్లపాటు ఆయన ఈ ప్రాంతంలో అందించిన సేవలను కొనియాడారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

భీమిని, న్యూస్‌టుడే: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా రైతులు టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని బిట్టూర్‌పల్లి గ్రామంలో పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

26 నుంచి దండారి ఉత్సవాలు

కాసిపేట(దేవాపూర్): మండలంలోని సల్పలవాగులో నిర్వహించే దండారి ఉత్సవాలను ఆదివాసీ కుల సంఘాలు సమన్వయంతో నిర్వహించాలని కమిటీ సభ్యులు అన్నారు. మండలంలోని దేవాపూర్ సల్పలవాగులో సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 26 నుంచి 27 వరకు ఉత్సవాలను నిర్వహించేందకు తీర్మానం చేసినట్లు చెప్పారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నూతన ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు.

ఇంధన్‌పల్లి రేంజి అధికారిగా శ్రీనివాస్



కె.శ్రీనివాస్

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పరిధి ఇంధన్‌పల్లి రేంజి అధికారిగా కె.శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్నారు. ఈయన మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ విభాగం నుంచి ఇంధన్‌పల్లికి బదిలీపై వచ్చారు. ఇంతకాలం ఇక్కడ ఇన్‌ఛార్జి రేంజి అధికారిగా విధులు నిర్వర్తించిన హఫీసొద్దీన్ బదిలీపై లక్సెట్టిపేటకు వెళ్లారు. జన్నారం, ఇంధన్‌పల్లి, తాళ్లపేట రేంజి పరిధిలో కొన్నేళ్లుగా సెక్షన్ అధికారిగా, డిప్యూటీ రేంజి అధికారిగా, ఇన్‌ఛార్జి రేంజి అధికారిగా విధులు నిర్వర్తించిన హఫీసొద్దీన్ అటవీశాఖ ఉన్నతాధికారుల మన్ననలు పొందారు.

సంక్షిప్తం

చిన్న వయస్సులో ఉపాధ్యాయురాలిగా ఎంపిక



వినీత

భీమారం, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన గుడిమల్ల సత్యనారాయణ-రాజకళ దంపతుల 22 ఏళ్ల కుమార్తె వినీత ఇటీవల విడుదల చేసిన డీఎస్సీలో ఆరేపల్లి ప్రాథమిక పాఠశాలలో(ఎస్జీటీ) ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. వ్యవసాయ పనులు, తాపీమేస్త్రీగా పనులు చేసుకుంటూ జీవనం సాగించిన కుటుంబ నేపథ్యంలో చిన్న వయస్సులో మొదటి ప్రయత్నంలో ఉద్యోగం సాధించడంపై పలువురు అభినందనలు తెలిపారు. దీంతోపాటు మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన దుర్గం కృష్ణ చెన్నూరు మండలంలోని అంగ్రాజ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

ఘనంగా కూచిపూడి నృత్య దినోత్సవం

జన్నారం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని స్లేట్ ఆంగ్లమాధ్యమ పాఠశాలలో మంగళవారం కూచిపూడి నృత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల మైదానంలో విద్యార్థులతోపాటు డ్యాన్స్‌మాస్టర్లు కూచిపూడి నృత్యం చేసి ఆకట్టుకున్నారు. స్లేట్ స్కూల్స్ గ్రూపు ఆఫ్ ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, రజితరెడ్డి, డ్యాన్స్ మాస్టర్ నర్మదగౌడ్, సుధా, కృష్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల సర్వే

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి పాత బస్టాండ్‌లోని ఊర చెరువు హద్దులపై మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. చెరువు విస్తీర్ణం, హద్దులు, శిఖం, బఫర్‌జోన్ హద్దుల నిర్ధారణకు రైతులతో కలిసి సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్, మండల సర్వే అధికారి కృష్ణ సర్వే చేపట్టారు. పూర్తి స్థాయి సర్వేకు మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని తెలిపారు. సర్వే అనంతరం నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని స్పష్టం చేశారు.



మందమర్రిలో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ పిరికిపండ్ల లింగమూర్తి, తండ్రి: రాయమల్లు, నివాసం: ఇం.నెం. 3-217, తాళ్ళపెల్లి గ్రామం, నస్పూర్ మండలం, మంచిర్యాల జిల్లా గారి ఆదేశానుసారము ఈ ప్రకటన ఇవ్వనైనది.

నా క్లయింట్ రిజిస్టర్ విక్రయ దస్తావేజు నెం. 2448/2012 ద్వారా సర్వే నెం. 122, గర్మిళ్ళ శివారు, మంచిర్యాల మున్సిపల్ పరిధిలోనిది 400 చ.గ. స్థలం పొంది అనుభవదారునిగా ఉన్నారు. గౌరవనీయులైన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, మంచిర్యాల గారు O.S.No. 132 OF 2008 మరియు I.A.No. 569 OF 2015 ద్వారా ఇచ్చిన ప్రిలిమినరీ, ఫైనల్ డిక్రీల పైన నా క్లయింట్‌కు తేది. 13-09-2024 తెలిసి గౌరవనీయులైన ప్రిన్సిపల్ జిల్లా కోర్టు, మంచిర్యాల నందు ప్రిలిమినరీ డిక్రీ ఫైనల్ డిక్రీల పైన అప్పీలు దాఖలు చేసి ఉన్నారు. ఈ అప్పీలు నందు గురిజాల చంద్రశేఖర్, పుప్పాల మంజుల, గురిజాల శంకరయ్య, మిగతా కొంత మంది ప్రతివాదులుగా ఉన్నారు. కావున ఈ బహిరంగ ప్రకటన ద్వారా సమస్త ప్రజలకు తెలియపరడమైనది.

Sd/-, KADASI SWAMY
Advocate
Mancherial. Cell: 96180 36648